



చిత్తూరు గాంధీ సర్కిల్ వద్ద బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాల నేతల నిరసన - కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

● నిరసన గళం

రాష్ట్రంలో రాక్షస పాలన

● పాత్రికేయులకే రక్షణ లేకుంటే సామాన్యుల పరిస్థితేంటి?

● ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై వైసీపీ మూకల దాడిపట్ల జిల్లావ్యాప్తంగా నిరసనలు

● పాల్గొన్న జర్నలిస్టు, ప్రజా సంఘాలు... రాజకీయ పక్షాలు

చిత్తూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 'ఇంతటి అమానుషమా? సీఎం సభ వద్ద గుంపుగా కలబడి ఫొటో జర్నలిస్టుపై విచక్షణారహితంగా దాడి చేస్తారా? దీన్ని చూస్తుంటే రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందనిపిస్తోంది' అంటూ పలువురు ధ్వజమెత్తారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారంనాటి 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫరు శ్రీకృష్ణపై వైసీపీ శ్రేణులు చేసిన దాడికి నిరసనగా సోమవారం జిల్లాలో ఆందోళనలు జరిగాయి. టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాలు, పాత్రికేయ సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ధర్నాలు చేశారు. జర్నలిస్టులకే రక్షణ లేకుంటే సామాన్యుల పరిస్థితి ఏంటని ఆవేదన చెందారు. దాడి చేసిన వారిని అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. బాధితుడు శ్రీకృష్ణకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

- చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో పాత్రికేయులు కలెక్టరేట్ సర్కిల్ నుంచి ర్యాలీగా వెళ్లి ఆందోళన చేశారు. జర్నలిస్టులకు పార్టీల రంగు పులమొద్దని కోరారు. రాప్తాడులో దాడిచేసిన వారిని శిక్షించాలంటూ డీఆర్వో పుల్లయ్యకు వినతి పత్రాన్ని అందించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలంటూ జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతి విజ్ఞప్తి చేశారు.ఆసంఘం నేతలతో కలిసి ఆయన సోమవారం కలెక్టర్ షన్మోహన్‌కు వినతిపత్రాన్ని అందించారు.
- దాడి చేసినవారిని శిక్షించి, వైద్య ఖర్చులకు రూ.10 లక్షలు ఇవ్వాలని టీడీపీ నాయకులు దొరబాబు, చంద్రప్రకాష్,సురేంద్రకుమార్,హేమలత తదితరులు డిమాం డు చేశారు. కలెక్టరేట్ ఎదుట వీరు నిరసన చేపట్టారు. చిత్తూరులోని గాంధీ సర్కిల్‌లో బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసనలు జరిగాయి.బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, సీపీఎం గంగరాజు, సీపీఐ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు. దళిత ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీరంగంపల్లి మునుస్వామి ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవనం వద్ద నిరసన తెలిపారు.
- కుప్పంలో టీడీపీ ఆధ్వర్యంలో అఖిలపక్షం నాయకులు, జర్నలిస్టు సంఘాల నాయకులు ఆర్టీసీ బస్టాండు కూడలిలో నిరసన చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. డీఎస్పీ శ్రీనాథ్‌కు వినతిపత్రం అదించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.
- పుంగనూరులో పాత్రికేయులు ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ర్యాలీగా అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకుని ధర్నా చేశారు. మళ్లీ ర్యాలీగా తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని డీటీకి వినతిపత్రం అందించారు. ఏపీడబ్ల్యూజే జిల్లా మాజీ కార్యదర్శి జనార్దన్, అప్పిరెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సలీమ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. చౌడేపల్లెలోనూ పాత్రికేయులు ఆందోళన చేశారు.
- పలమనేరులో పాత్రికేయులు, టీడీపీ, సీపీఎం నాయకులు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. రాప్తాడు ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఆర్డీవో కార్యాలయంలోని ఏవోకు వినతిపత్రం అందించారు. పెద్దపంజాణి మండలంలో పాత్రికేయులు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు.
- పూతలపట్టులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద పాత్రికేయుల నిరసనకు టీడీపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. వైసీపీ రాక్షసపాలనను ప్రజలు చూస్తున్నారు, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ హెచ్చరించారు.
- జీడీనెల్లూరులో అంబేడ్కర్ విగ్రహానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పూలమాలవేసి నివాళులర్పించారు. ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వినతిపత్రాన్ని అందించారు. కార్వేటినగరంలో పోలీస్‌స్టేషన్ ఎదుట పాత్రికేయులు ధర్నా చేశారు. రాప్తాడు ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ నిరసనలకు కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవర్ధన్‌రెడ్డి మద్దతు పలికారు.
- నగరిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పాత్రికేయుల నిరసనకు టీడీపీ, జనసేన, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. అక్కడ్నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందించారు.



కుప్పంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట టీడీపీ, అఖిలపక్ష సంఘాల నేతల ఆందోళన

ఇప్పుడు మీడియాపై పడ్డారు



జగన్ అధికారంలోకి రాగానే తొలుత టీడీపీ నేతలు, కార్యకర్తలను లక్ష్యం చేసుకున్నారు. దాడులు, దౌర్జన్యాలతో రెచ్చిపోయారు. ఇప్పుడు ప్రజాస్వామ్య పరిరక్షకులైన మీడియా ప్రతినిధులపై పడ్డారు. ఇలాగే మనం ఊరుకుంటే రేపు ఇళ్లల్లో దూరి కొడతారు. ఆస్తులను లాక్కుని మనల్ని బికారులను చేస్తారు. ప్రజలు మేలుకోవాలి. ప్రజాస్వామ్య పరిరక్షకులైన పాలకులను వచ్చే ఎన్నికల్లో గెలిపించుకుని రాష్ట్రాన్ని ఆ దౌర్జన్యాలనుంచి రక్షించుకోవాలి. లేదంటే రాష్ట్రంలో జగనన్న రాజ్యాంగానికి బలి కావాల్సి వస్తుంది.

- కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ

ఇది ప్రజాస్వామ్యంపై దాడి




రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడే. ఇది అమానుషం. జగన్ తన బూటకపు ప్రసంగాలతో జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. ఎవరిది అభివృద్ధి పాలనో.. ఎవరిది అసుద్ద పాలనో ప్రజలకు తెలుసు.

- అమరనాథరెడ్డి, మాజీ మంత్రి

అధికార యంత్రాంగంలో తిరుపతి భయం!

పుంగనూరులో మాత్రం మారని పోలీసులు



చిత్తూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపించిన సమయంలో విధినిర్వహణ అన్నది ప్రభుత్వ అధికారులకు, పోలీసు అధికారులకు కత్తిమీద సాము వంటిదే. అధికారంలోకి వచ్చేది ఎవరు అనే దాన్నిబట్టే వీరి వైఖరి మారిపోతుంది. వైసీపీ వంటి దబాయింపు రాజకీయాలు చేసే పార్టీ అధికారంలో ఉండడంతో ఐదేళ్లుగా జిల్లాలో దౌర్జన్యాలకు అంటకాగారనే ఆరోపణలను పోలీసు, అధికార యంత్రాంగం మోసింది. అయితే తిరుపతి ఉప ఎన్నికల దొంగ ఓట్ల కుంభకోణంలో ఐఏఎస్, ఏపీఎస్‌ల మొదలు కింది స్థాయి ఉద్యోగులు దాకా బలవుతున్న తీరు చూశాక మాత్రం అందరిలో ఆందోళన పెరిగింది. అయినా వైసీపీ నేతల ఒత్తిళ్ల తగ్గడం లేదు. కోరుకున్న వారినే కోరుకున్న తావులో వేసుకుంటున్నారు. కొత్తగా కొలువుల్లో చేరుతున్న వారిలో మాత్రం మునుపటి తెగింపు లేదంటున్నారు. అధికారం చేతులు మారితే తీవ్ర పరిణామాలు ఉంటాయనే భయం వీరిలో పెరిగిందని తెలుస్తోంది. బీహార్‌తో పోటీపడే పుంగనూరు నియోజకవర్గంలో మాత్రం ఇప్పటికీ పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే పోలీసు, అధికార యంత్రాంగం మొత్తం ఉండడం మీదే జిల్లాలో చర్చ జరుగుతోంది. తాజాగా టీడీపీ వారిపై రౌడీషీట్లు తెరుస్తూ భయభ్రాంతులను చేయడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ఎన్నికలకు దూరంగా ఉంచే వ్యూహం

టీడీపీ కీలక నాయకులు పోలింగ్ వేళ బయట తిరగకూడదనే ఉద్దేశంతోనే ఈ రౌడీషీట్ అంశాన్ని తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. ఎక్కువగా కేసులు పెట్టి, రౌడీషీట్ నమోదు చేస్తే పోలింగ్ ముందు ప్రచారం చేయకుండా, పోలింగ్ కేంద్రంలో ఏజెంట్‌గా కూర్చోకుండా చేయాలన్నదే వైసీపీ లక్ష్యంగా ప్రచారం అవుతోంది. ఆయన ఆదేశాల మేరకు అనుగుణంగా పోలీసులూ పనిచేస్తున్నారని చెబుతున్నారు. గతేడాది ఆగస్టు 4న భీమిగానిపల్లె వద్ద పోలీసులు- టీడీపీ నాయకుల మధ్య జరిగిన అల్లర్ల విషయంలో వందల మంది టీడీపీ శ్రేణుల మీద పోలీసులు కేసులు పెట్టారు. వెంటాడి అరెస్టు చేసి జైళ్లకు పంపించారు. ఆ ఘటన సమయంలో అక్కడ లేనివారినీ కేసుల్లో ఇరికించారు. చెడ్డపేరు వచ్చినా తగ్గకుండా దీన్ని కొనసాగించారు. ఇదంతా వ్యూహాత్మకంగా చేశారంటున్నారు. ఇప్పుడు ఎక్కువ కేసులున్నాయనే కారణంగానే రౌడీషీట్ నమోదు చేస్తున్నారు. రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లో టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి సహా 39 మందిపై రౌడీషీట్ నమోదు చేశారు. ఎన్నికల నాటికి ఈ సంఖ్యను వందకు పెంచాలని పోలీసులకు ఆదేశం అందినట్టు ప్రచారం జరుగుతోంది.

రామచంద్రయాదవ్ మీద కూడా

పుంగనూరులో బీసీవై అధినేత రామచంద్రయాదవ్, పెద్దిరెడ్డి మీద గట్టిగానే పోరాడుతున్నారు. దీంతో ఆయన్ను కూడా లక్ష్యం చేసుకుని, వేధిస్తున్నారు. తాజాగా రామచంద్రయాదవ్ పంపిణీ చేస్తున్న గోడ గడియారాల బాక్సుల్లో కర్ణాటక మద్యం ఉందంటూ కేసులు పెట్టారు.

కొత్త పోలీసు అధికారులైనా..?

ఎన్నికల దృష్ట్యా జిల్లాలో పెద్దఎత్తున పోలీసు అధికారుల్ని మార్చారు. కీలక అధికారులైన ఎస్పీ, డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఎస్పీగా జాషువా, చిత్తూరు, పలమనేరు, కుప్పం డీఎస్పీలుగా రాజగోపాల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, శ్రీనాథ్‌లు వచ్చారు. వీరంతా గతంలో పనిచేసిన ప్రాంతాల్లో వైసీపీకి అనుకూలంగా ఉంటూ ప్రతిపక్షాలను ఇబ్బందులు పెట్టారనే ఆరోపణలున్నాయి. ఎన్నికల సమయంలోనూ కీలక స్థానాల్లో ఉన్న వీళ్లు అదే తరహాలో వ్యవహరిస్తే కేంద్ర ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు బలి అవ్వక తప్పదని తిరుపతి ఘటన చెబుతోంది. కెరీర్ ముఖ్యమని భావించి నిష్పక్షపాతంగా పనిచేసిన అధికారులు, భవిష్యత్తులో ప్రభుత్వాలు మారినా ఇబ్బందులు పడకుండా ఉంటారని, కాదని తెగించి స్వామిభక్తిని ప్రదర్శించి అన్యాయాలకు అంటకాగితే బలవుతారనే వ్యాఖ్యలు సీనియర్ రిటైర్డ్ అధికారుల నుంచే వినిపిస్తున్నాయి.

'బర్డ్ ఫ్లూ'పై అప్రమత్తం

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 19: నెల్లూరు జిల్లాలో ఇటీవల బర్డ్‌ఫ్లూ కోళ్లలో నిర్ధారణ కావడంతో జిల్లాలో పశుసంవర్ధక శాఖ అప్రమత్తమైందని జేడీ ప్రభాకర్ తెలిపారు. గణాంకాల ప్రకారం జిల్లాలో 9.35 లక్షల ఫారం కోళ్లు, 6.5 లక్షల పెరటి కోళ్లు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో జిల్లాకు బర్డ్‌ఫ్లూ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. బర్డ్ ఫ్లూకు చికిత్స, టీకా లేదని.. నివారణ ఒక్కటే మార్గమన్నారు. అందుకనే నెల్లూరు జిల్లా నుంచి కోళ్లు, దాణా, ఉత్పత్తులు రాకుండా చర్యలు చేపట్టామన్నారు. కోళ్ల ఫారం యజమానులకు, జీవ రక్షణ విధానాలపై అవగాహన కల్పించామన్నారు. కోళ్ల అసాధారణ మరణాలపై దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. మండలాల వారీగా 31 రాపిడ్ రెస్పాన్స్ టీంలు ఏర్పాటు చేశామన్నారు. పీపీఐ కిట్లు, క్రిమి సంహారక మందులు అందుబాటులో ఉంచామన్నారు. సాయం, సలహాలు అవసరమైనా స్థానిక పశువైద్య అధికారిని సంప్రదించాలని సూచించారు.

నేడు నారా భువనేశ్వరి కుప్పం రాక

● గుడుపల్లెలో మృతుల కుటుంబాలకు పరామర్శ



కుప్పం, ఫిబ్రవరి 19: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు ఎండీ నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' యాత్రకు మంగళవారం కుప్పం వస్తున్నారు. చంద్రబాబు జైలుకు వెళ్లినప్పుడు తట్టుకోలేక జిల్లాలో మరణించిన వారి కుటుంబాలను పరామర్శించనున్నారు. ఈమె పర్యటన వివరాలను సోమవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం కుప్పంలో మీడియకు వివరించారు. గుడుపల్లె మండలం కొడతనపల్లె గ్రామంలో మృతుడు టి.వెంకటేశ్ కుటుంబాన్ని మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు పరామర్శిస్తారని పేర్కొన్నారు. 3 గంటలకు గుడుపల్లె ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌కు చేరుకుని అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తారన్నారు. అనంతరం మల్లప్ప కొండపై మల్లేశ్వరస్వామిని దర్శించుకుంటారన్నారు. సాయంత్రం 6.35 గంటలకు యామగానిపల్లెలో జి.వెంకటేశులు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెబుతారని వివరించారు. అనంతరం కుప్పం చేరుకుని హెబ్రోను చర్చిలో ప్రార్థనల్లో పాల్గొంటారన్నారు. అక్కడినుంచి చంద్రబాబు పీఏ మనోహర్ ఇంటికి వెళ్లి ఆయన్న పరామర్శిస్తారన్నారు. రాత్రి ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బస చేస్తారు. 'బుధవారం ఉదయం 10.10 గంటలకు శాంతిపురంలో మహిళలతో ముఖాముఖిలో నారా భువనేశ్వరి పాల్గొంటారు. 11.20 గంటలకు ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకుని అన్న క్యాంటీన్ ప్రారంభిస్తారు. అక్కడ్నుంచి రామకుప్పం చేరుకుని పోలీసు స్టేషన్ పక్కనే అన్న క్యాంటీన్ ప్రారంభిస్తారు. మధ్యాహ్న భోజనం తర్వాత పెద్దపంజాణి మండలానికి బయలుదేరి వెళతారు' అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

22న పులిచెర్లలో పర్యటన

కల్లూరు: 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి ఈనెల 22న పులిచెర్ల మండలంలో పర్యటిస్తున్నట్లు పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శిస్తారన్నారు. ఇలా 22న మధ్యాహ్నం 12 గంటలకు కమ్మపల్లికి చెందిన టీడీపీ వీరాభిమాని వెంకటపతినాయుడు కుటుంబాన్ని.. ఒంటి గంటకు గడ్డంవారిపల్లి పంచాయతీ పగడాలవారిపల్లికి చెందిన టీడీపీ నేత దొరస్వామి కుటుంబసభ్యులను పరామర్శిస్తారన్నారు.

26న శాంతిపురానికి సీఎం రాక

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 26న శాంతిపురం మండలానికి వస్తున్నట్లు కలెక్టర్ షన్మోహన్ అన్నారు. బహిరంగ సభలో సీఎం పాల్గొంటారన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై ఆయన జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. సీఎం పర్యటన సందర్భంగా కేటాయించిన విధులను ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా బాధ్యతతో నిర్వహించాలన్నారు. డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ ఎస్. రాజశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నేడు ఏపీ జేఏసీ ధర్నా

చిత్తూరు, ఫిబ్రవరి 19: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కేవీ రాఘవులు తెలిపారు. సోమవారం ఎన్జీవో భవనంలో జరిగిన సంఘ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో పలు దఫాలుగా సమస్యలను ప్రస్తావించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 12వ పీఆర్సీతో కూడిన 30 శాతం ఐఆర్‌ను మంజూరు చేయాలని, డీఏ బకాయిల విడుదల, జీపీఎఫ్, ఏపీ జీఎల్ లోన్ల మంజూరు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, పెన్షనర్లకు ఒకటో తేదీన పెన్షన్లను మంజూరు చేసి అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వశాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించి సమాన పనికి సమాన వేతనాన్ని ఇవ్వాలనే డిమాండుతో ధర్నా చేస్తున్నామన్నారు. జిల్లాలోని ఉద్యోగులందరూ హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

నర్రావూరులోనే పోలింగ్ కేంద్రం కొనసాగించాలి

చిత్తూరు, ఫిబ్రవరి 19: యాదమరి మండలం నర్రావూరులోనే పోలింగ్ కేంద్రాన్ని కొనసాగించాలంటూ రెండు గ్రామాల ప్రజలు కోరారు. సోమవారం స్పందన సందర్భంగా పలువురు గ్రామస్థులు కలెక్టరేట్‌లో డీఆర్వో పుల్లయ్యకు వినతిపత్రాన్ని ఇచ్చారు. చాలా ఏళ్ల నుంచి నర్రావూరు ఆది ఆంధ్రవాడలోనే పోలింగ్ బూత్ ఉండేదని, అక్కడే ప్రతి ఎన్నికల్లోనూ ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేవారమని తెలిపారు. ఇప్పుడు నర్రావూరులో ఉన్న పోలింగ్ బూత్‌ను మార్చి కోణాపల్లెలో ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారని తెలిపారు. కోణాపల్లెలో పోలింగ్ బూత్ ఉంటే తామంతా నిర్భయంగా ఓటు వేసే పరిస్థితులు లేదన్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నర్రావూరులోనే పోలింగ్ బూత్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఆర్వోను కలిసిన వారిలో నర్రావూరు గ్రామస్తులతో పాటు యాదమరి మండల టీడీపీ అధ్యక్షులు మురార్జీ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ రవి, తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ బూత్‌ను మార్చవద్దని కలెక్టరేట్‌కు వచ్చిన నర్రావూరు గ్రామస్తులు

● కలెక్టరేట్ స్పందనకు 182 అర్జీలు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనకు వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని డీఆర్వో పుల్లయ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో డీఆర్వోతో పాటు డ్వామా పీడీ రాజశేఖర్, జిల్లా మైనార్టీ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి వినతి పత్రాలను స్వీకరించారు. అధికారుల దృష్టికి మొత్తం 182 అర్జీల రాగా శాఖల వారీగా వాటి వివరాలు.. రెవెన్యూశాఖకు 157, రేషన్‌కార్డులు, పెన్షన్లకు 10, మిగిలిన శాఖలకు 14 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా అర్జీదారుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది.



అర్జీదారులతో మాట్లాడుతున్న డీఆర్వో పుల్లయ్య

పోలీసు స్పందనకు 19 అర్జీలు

జిల్లా పోలీసు ఏఆర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాధితుల నుంచి ఏఎస్పీ అరీఫుల్లా వినతిపత్రాలను స్వీకరించారు. వారి సమస్యలను విని పరిష్కారానికి నిర్ణీత సమయంలోగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అధికారుల దృష్టికి మొత్తం 19 అర్జీలు అందగా, వాటి వివరాలు.. భూ తగాదాల కింద 9, కుటుంబ తగాదాల కింద 3, వేధింపులు 2, డబ్బు తగాదాలు 2, దారి తగాదాలు 2 వంతున అర్జీలు అందాయి.

నేడు జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చిత్తూరులోని ఎస్వీసెట్‌లో జరిగే ప్రాంతీయ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షన్మోహన్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్వీసెట్‌కు వెళ్లే నిరుద్యోగుల కోసం పీసీఆర్ కళాశాల, ఆర్టీసీ బస్టాండ్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే యువతీ యువకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ లింకులో నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు జిరాక్సు, 20 బయోడేటా ఫారాలు (రెజ్యూమ్‌లు), సర్టిఫికెట్ల జిరాక్సులను తీసుకురావాలని సూచించారు. వందకు పైగా ఐటీ సెక్టార్, బీపీవో, ఎలక్ట్రానిక్, మాన్యుఫాక్చరింగ్, రీటైల్ సెక్టార్లకు సంబంధించిన దాదాపు వందకు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఇతర వివరాలకు 81425 09017, 63009 54441 నెంబర్లలో సంప్రదించాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్‌మోహన్ రెడ్డి, గుణశేఖర్ రెడ్డి సూచించారు.

ఇళ్ల స్థలాల ఆన్‌లైన్ ప్రక్రియకు మరో వారం రోజుల గడువు పెంపు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19: వివిధ కారణాలతో ఇళ్ల స్థలాల కోసం ఇంతవరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 26వరకు గడువు పొడిగించినట్లు ఐ&పీఆర్ కమిషనర్ తెలిపారని డీడీ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టుల సంఘం వినతిమేరకు ప్రభుత్వం గడువును పొడిగించిందన్నారు. ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోని, చేసుకున్నా సబ్మిట్ కొట్టని జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రూ.100 కోట్లతో అభివృద్ధి ప్రణాళిక అమలు

● పద్మావతి వర్సిటీ వీసీ భారతి



విలేకరులతో మాట్లాడుతున్న వీసీ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 19: రూ.100 కోట్ల పీఎం ఉష (ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్) నిధులతో యూనివర్సిటీలో ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తామని పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి పేర్కొన్నారు. సోమవారం వర్సిటీలో ఆమె మీడియాతో మాట్లాడుతూ బోధన, పరిశోధన రంగాల్లో ప్రమాణాలతో పాటు నాక్ ఏ ప్లస్ గుర్తింపు ఆధారంగా పీఎం ఉష ద్వారా వర్సిటీకి రూ.100 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో బోధన, పరిశోధన, వసతులు కల్పిస్తామని వివరించారు. ఇప్పటికే నిర్వహిస్తున్న ప్రాజెక్టులు, ఒప్పందాలు, పరిశోధనలు, తరగతుల్లో ప్రమాణాలను పెంపొందించింది, భవిష్యత్తులో మరిన్ని ర్యాంకులు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఎడెక్స్ పథకం ద్వారా ఏర్పాటైన డిప్లొమో కోర్సులకు మూడువేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రిజిస్ట్రార్ రజని, పీఆర్వో శ్రీరజని పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.96 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.96 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 70,338 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,741 మంది తలనీలాలు సమర్పించారు.

ఉద్యోగులకు 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి



మాట్లాడుతున్న చిరంజీవి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 19: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ అమలు చేసే వరకు 30శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ఇవ్వాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్(1938) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి కోరారు. టీపీపీఎం స్కూల్‌లో సోమవారం సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ధరల ఆధారంగా ద్రవ్యోల్బణానికి అనుగుణంగా 2023 జూలై 1నుంచి ఐఆర్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కరువుభత్యం తరహాలో రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల డీఏ ఇవ్వాలని, నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, అడ్వాన్స్ సరెండర్ లీవులు, ఏపీజీఎల్ఐ మెడికల్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్లకు బకాయిపడ్డ రూ.22,500 కోట్లను వెంటనే మంజూరు చేయాలని తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్కే బాబు, ఎస్.వెంకటముని, రాష్ట్ర కౌన్సిలర్ మోహన్‌దాస్, గౌరవాధ్యక్షుడు నాగూరయ్య, అదనపు కార్యదర్శి సురేష్, కార్యదర్శి కృష్ణప్రసాద్, ఆడిట్ సభ్యులు రవీంద్ర పాల్గొన్నారు.

ఫేస్‌బుక్ ప్రేమికులు.. ఒక్కటయ్యారు..!



ప్రేమికులతో మాట్లాడుతున్న డీటీ

పాలసముద్రం, ఫిబ్రవరి 19: ఫేస్‌బుక్ పరిచయం.. ప్రేమగా మారి ఒకటైందా జంట. పాలసముద్రం మండలం గంగమాంబాపురం గ్రామానికి చెందిన దీపిక (19)కి తల్లిదండ్రులు పెళ్లి నిశ్చయం చేశారు. మరో 10 రోజుల్లో పెళ్లి జరగాల్సివుంది. ఈ క్రమంలో ఫేస్‌బుక్ పరిచయంతో ప్రేమికుడిగా తిరుపతి జిల్లా తడ మండలం రామాపురం గ్రామానికి చెందిన విఘ్నేష్ వద్దకు ఈనెల 15న వెళ్లిపోయింది. మేజర్లయిన వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. తల్లిదండ్రులకు విషయం తెలియకపోవడంతో దీపిక కనిపించడం లేదని పాలసముద్రం పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు ఆ జంట ఆచూకీ తెలుసుకున్నారు. సోమవారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ జానకిరామ్ ఇరువురు తల్లిదండ్రులతో మాట్లాడి, ఇద్దరూ మేజర్లు కావడంతో డీటీ మధుబాబు ఎదుట హాజరుపరిచారు. దీపిక తాను ప్రేమికుడి వెంటనే వెళతానని చెప్పడంతో తల్లిదండ్రులు మిన్నకుండి పోయారు.

ఆటో బోల్తా : ఒకరి మృతి



చంద్రశేఖర్ (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, ఫిబ్రవరి 19: చంద్రగిరి మండలం, బి.కొంగరవారిపల్లె సమీపంలో అడవి పంది అకస్మాత్తుగా దూరి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో ఆటో నడుపుతున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు రేణిగుంట సమీపంలోని రామకృష్ణాపురంకు చెందిన చంద్రశేఖర్ (55) రోజు వారి దినపత్రికల కట్టను రేణిగుంట నుంచి చంద్రగిరి మండలం, చిన్నరామాపురం వరకు దినపత్రికలు వేస్తున్నాడు. సోమవారం ఉదయం యధావిధిగా ఆటోలో దినపత్రికలు తీసుకుని చిన్నరామాపురంకు వెళ్ళుతుండగా మార్గమధ్యలోని బి.కొంగరవారిపల్లె సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా అడవి పంది దూరింది. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో ఆటో నడుపుతున్న చంద్రశేఖర్ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్

ఆలస్యంగా నడిచిన పలు రైళ్లు



గూడ్స్‌రైలు పునరుద్ధరణ పనుల్లో అధికారులు

రేణిగుంట,ఫిబ్రవరి 19: తిరుపతి జిల్లా రేణిగుంట రైల్వే స్టేషన్ దక్షిణం వైపు యార్డులో ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. చెన్నయ్‌లోని మేల్పాకం నుంచి కార్ల లోడ్‌తో అసోంలోని ఛాంగ్‌సరికెకు వెళుతున్న గూడ్స్ రైలు సోమవారం రాత్రి 9.15 గంటలకు పట్టాలు తప్పింది.రేణిగుంట స్టేషన్ లోని రోడ్డు నెంబరు సెవన్‌లోకి వెళుతున్న సమయంలో ఇంజన్ నుంచి మూడవ పెట్టె క్రాసింగ్ వద్ద పట్టాలు తప్పింది.గత ఏడాది కాలంలో ఇదే ప్రాంతంలో మూడుసార్లు ప్రమాదాలు జరగడం గమనార్హం. హుటాహుటిన యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్ సిబ్బంది అక్కడకు చేరుకొని పునరుద్ధరణ పనులు చేపట్టారు. సీడీవో ప్రణయ్‌కుమార్,ఐటీఎఫ్ సందీప్ కుమార్‌లతో పాటు పలువురు అధికారులు పనులను పర్యవేక్షించారు. ప్రధానరైలు మార్గంలో ప్రమాదం జరగడంతో చెన్నై నుంచి విశాఖ పట్టణం, ముంబాయి, తిరుపతి, భువనేశ్వర్‌లకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్ళు గంటల కొద్దీ ఆలస్యంగా నడిచాయి.ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

హథీరాంజీ మఠం భూముల్లో అక్రమ కట్టడాలను కూల్చేస్తాం!

● కబ్జాదార్లకు మఠం ఫిట్ పర్సన్ హెచ్చరిక

తిరుపతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి హథీరాంజీ మఠం భూముల్లో అక్రమ కట్టడాలను కొనసాగించినట్టయితే కూల్చివేస్తామని మఠం ఫిట్ పర్సన్ జి.రమేష్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెడతామని, మఠం భూములను విక్రయించి సామాన్యులను మోసగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని మఠం భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి ప్లాట్లుగా విక్రయించి అక్రమ దందా చేస్తున్నారని ప్రకటనలో పేర్కొన్నారు. ఆ విధంగా మఠం భూమిని ఆక్రమించి ప్రహరీ గోడలు నిర్మిస్తుండగా ఈనెల 15వ తేదీన రెవిన్యూ అధికారుల సహాయంతో వాటిని తొలగించడం జరిగిందని పేర్కొన్నారు. అయినా ఇంకా చాలా మంది నిర్మిస్తున్నట్టు సమాచారం అందడంతో సోమవారం వాటిని అడ్డుకునేందుకు తిరుపతి రూరల్ తహసిల్దారు మహబూబ్ చాంద్, మఠం సహాయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులురెడ్డి వెళ్ళగా ఆక్రమణదారులు వారిని చుట్టుముట్టి వాగ్వాదానికి దిగినట్టు వివరించారు. మఠం భూమిలో అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తే వాటిని కూల్చివేస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

తిరుపతిలో చోరీ

● 113 గ్రాముల బంగారు ఎత్తుకెళ్లిన దొంగలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 19: ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి దొంగలు 113 గ్రాముల బంగారు నగలు ఎత్తుకెళ్లిన ఘటన తిరుపతి నగరం శివజ్యోతి నగర్‌లో చోటుచేసుకుంది. ఆదివారం జరిగిన ఈ ఘటన సోమవారం వెలుగుచూసింది. శివజ్యోతినగర్‌కు చెందిన ఎం.వినాయకం ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య పుట్టింటికిపోవడంతో ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. ఉదయం విధులకు వెళ్లే ఆయన రాత్రి తిరిగి వస్తుంటాడు. ఆదివారం రాత్రి ఆయన వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి కనిపించాయి. లోపలకు వెళ్లిచూడగా బీరువా తెరిచి ఉండడమేగాక వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడంతో అలిపిరి పోలీసులకు సమాచారమిచ్చాడు. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించింది. 113 గ్రాముల బంగారు నగలు చోరీ అయ్యాయన్న బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఐఐటీ, ఐసర్ నేడు జాతికి అంకితం



ఏర్పేడు, ఫిబ్రవరి 19 : ఏర్పేడు వద్ద ఉన్న ఐఐటీ, ఐసర్‌లను కేంద్రప్రభుత్వం జాతికి అంకితం చేయనుంది. కేంద్రీయ విద్యాసంస్థలయిన భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థకు మేర్లపాక రెవెన్యూ పరిధిలో 560 ఎకరాలను, భారతీయ విజ్ఞాన శిక్షణ, మరియు పరిశోధన సంస్థకు జంగాలపల్లి రెవెన్యూ శ్రీనివాసపురం పంచాయతీలో 268 ఎకరాలను గత టీడీపీ ప్రభుత్వంలో కేటాయించిన విషయం తెలిసిందే.అప్పటి నుంచీ జరుగుతున్న భవన నిర్మాణాలు ఇటీవల పూర్తయిన సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఈ సందర్భంగా తిరుపతి ఐఐటీలో ఏర్పాట్లు చేసినట్లు ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఐసర్ డైరక్టర్ శాంతను భట్టాచార్య తెలిపారు.



చిన్నప్పటి నుంచే తిరుమలకు వస్తున్నా

హీరోయిన్ శ్రీలీల

తిరుమల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : చిన్నప్పటి నుంచీ తరచూ తిరుమలకు వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం తనకు అలవాటని హీరోయిన్ శ్రీలీల చెప్పారు.సోమవారం ఉదయం ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.అనంతరం ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ..కుటుంబ సమేతంగా శ్రీవారిని మరోమారు దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలుగుతో పాటు తనకు వివిధ భాషల్లో అవకాశాలొస్తున్నాయని,త్వరలో అన్ని వివరాలనూ ప్రకటిస్తానన్నారు. కాగా, ఆలయం ముందు శ్రీలీలను చూసేందుకు యాత్రికులు ఎగబడ్డారు.ఆమెతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు.

ఏసీబీ వలలో వీఆర్వో

కేవీబీపురం, ఫిబ్రవరి 19 : కేవీబీపురం మండలంలోని కోవనూరు వీఆర్వోగా పని చేస్తున్న మునిరాజ సోమవారం ఓ రైతు వద్ద రూ.5వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ ఏఎస్పీ దైవప్రసాద్ కథనం మేరకు ...కర్లపూడి గ్రామానికి చెందిన శేఖర్ విద్యుత్ కనెక్షన్ నిమిత్తం వాల్టా సర్టిఫికెట్ కావాలంటూ సంవత్సర కాలంగా తిరుగుతున్నాడు.చివరకు వీఆర్వో మునిరాజ రూ.20వేలు డిమాండ్ చేయడంతో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు.వారిచ్చిన సమాచారంతో కేవీబీపురంలోని ఒక కూల్‌డ్రింక్ దుకాణంలో రైతు శేఖర్ నుంచి రూ.5వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.మునిరాజపై కేసు నమోదు చేశారు. డీఎస్పీ ప్రశాంతి, ఇన్‌స్పెక్టర్లు ఈశ్వర్, సునీల్ కుమార్, ఎల్‌వీ నాయుడు, ఎస్ఐ సూర్యనారాయణ తదితరులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

సిద్ధం సభకు వెళ్లిన శ్రీవారి బస్సులు మద్యపానంతో అపవిత్రం

● టీడీపీ నేతల ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి భక్తులు తిరుమలకు వెళ్లే బస్సులను అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు వినియోగించారని, వాటిలో మద్యపానం సేవించి, బిరియానీలు తిని అపవిత్రం చేశారని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ మండిపడ్డారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో పార్టీ నాయకులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రయాణికులను, శ్రీవారి భక్తులను ఇబ్బంది పెట్టి ఆర్టీసీ బస్సులను సిద్ధం సభకు తరలించారన్నారు. సభలో సీఎం జగన్ రెడ్డి మాట్లాడుతుండగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేయడం దారుణమన్నారు. సీఎంపై హత్యాయత్నం కేసు పెట్టాలని డిమాండు చేశారు. ఫ్యాన్ రెక్కలు విరిచేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్ల రూపాయల వరకు దారి మళ్లించారని ఆరోపించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నాయకులు శాంబోళ హరినాథ్, మనోహరాచారి, చెంగయ్య, గిరీష పాల్గొన్నారు.

రుయాలో చెదల నివారణకు నెలకు రూ.5 లక్షలట !



రుయాస్పత్రి పరిపాలన భవనం

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 19 : ఆస్పత్రి ఆవరణలో మహా అయితే చెత్తాచెదారం ఉంటుంది. కానీ చెదల నివారణ ఏజన్సీ పేరుతో రూ.లక్షలు స్వాహా చేస్తున్న పరిస్థితి రుయాస్పత్రి, ఎస్వీ వైద్య కళాశాల, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి పరిధిలో నెలకొంది. ఈ ఆస్పత్రుల పరిధిలో చెదలు నివారణ చర్యలు చేపట్టేందుకు 2021 జూన్‌లో ఒక ఏజన్సీకి బాధ్యతలు అప్పగించారు. ఆ ఏజన్సీ తరపున సబ్ కాంట్రాక్టు కింద బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టర్ కొంతకాలం ఆస్పత్రి పరిసరాల్లో అరకొర చెదల నివారణ చర్యలు చేపట్టారు. వచ్చే బిల్లుల్లో అధికారుల చేతులు తడపలేక తప్పుకున్నాడు. తర్వాత ఆ బాధ్యతలు ఎవరు నిర్వహిస్తున్నారనేది రహస్యంగానే ఉంది. అయినప్పటికీ చెదల నివారణ పేరుతో ఇప్పటికే రూ.1.60 కోట్లను అధికారులు బిల్లులు చేశారు. రుయాస్పత్రిలో కొందరు అధికారులు పారిశుధ్య ఏజన్సీ బాధ్యతలు నిర్వహిస్తున్న కాంట్రాక్టరుతో కుమ్మక్కై చెదల నివారణ పేరుతో నెలకు రూ.5 లక్షలు వారి జేబుల్లో వేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా చెదలు నివారణ చర్యలు చేపట్టేందుకు నిబంధనల మేరకు ఐదుగురు కార్మికులు, ఇద్దరు సూపర్‌వైజర్లను నియమించాలి. పిచికారి చేసే రసాయనాలు, స్ప్రేలు కొనుగోలు చేయాలి. కానీ ఇక్కడ అవేమీ జరగడంలేదు. పారిశుధ్య కార్మికుల్లోని కొందరినే చెదలు నివారణ సిబ్బందిగా చూపుతూ నిధులు స్వాహా చేస్తున్నారు. మూడేళ్లుగా ఇదే తంతు కొనసాగుతున్నా పట్టించుకునే వారు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీ పేరుతోనే బిల్లులు చెల్లిస్తున్నాం

ఈ విషయమై రుయాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభ మాట్లాడుతూ చెదల నివారణకు సంబంధించి మొదట్లో ఒప్పందం కుదుర్చుకున్న ఏజన్సీ పేరుతోనే ఇప్పటికీ బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. సబ్ కాంట్రాక్టర్లు కొందరు మారినా బిల్లులు మాత్రం ఒప్పందం కుదుర్చుకున్న ఏజన్సీకి చెల్లిస్తున్నామని తెలిపారు. ఏజన్సీ తరఫున నలుగురు సిబ్బంది ఆస్పత్రిలో చెదలు నివారణ చర్యలు చేపడుతున్నారని చెప్పారు. ఏవైనా అవకతవకలు జరుగుతుంటే పరిశీలించి తగు చర్యలు చేపడతామన్నారు.

పనిభారం తగ్గించాలి

పలమనేరు, ఫిబ్రవరి19 : తమ పనిభారం తగ్గించాలని కోరుతూ ఆరోగ్య కార్యకర్తలు సోమవారం పలమనేరులోని కాకాతోపు అర్బన్‌ ఆరోగ్య కేంద్రంలో తాలూకా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జయశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరోగ్యకార్యకర్తలకు పనిభారం ఎక్కువగా ఉన్నందున వారు మానసిక ఆందోళనకు గురై పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌సీహెచ్‌ పోర్టరులో తాము పనిచేసిన పనికి మరొకరికి అనగా ఎంఎల్‌హెచ్‌పీకి (సీహెచ్‌ఓ)కు పారితోషికం ఇవ్వడం అన్యాయంగా ఉందన్నారు. ఈ సమస్యను జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయికి తీసుకువెళ్లి వాటి పరిష్కార దిశగా ప్రయత్నం చేస్తామని జయశంకర్‌ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు అముద, అనిల, హారతి, సుభాషిణి పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాహోమం, వాస్తుపూజ



వి.కోట, ఫిబ్రవరి 19: స్థానిక దుర్గానగర్‌ దుర్గామాత ఆలయంలో నూతనంగా నిర్మించిన కల్యాణమండపాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ సోమవారం ఉదయం ప్రారంభించారు. ఉదయాన్నే గోపూజ, వాస్తుపూజ, గణపతి హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి మండపంలో కొలువుతీర్చారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దుర్గాహోమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. దాతలు 300 మంది రూ. 1.5 కోట్ల మేరకు విరాళాలు ఇవ్వగా ఈ కల్యాణ మండపం రూపుదిద్దుకుందని, అతి తక్కువ వ్యయంతో ఈ మండపం అందుబాటులో ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది. దుర్గామాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం చండీ హోమం నిర్వహించనున్నారు. 108 మంది దంపతులు సంప్రదాయ వస్త్రధారణతో ఈ హోమంలో పాల్గొంటారు. శృంగేరి మఠం నుంచి వచ్చిన వేద పండితుల ఆధర్యంలో చండీ హోమం జరగనుంది.

గన్నావారిపల్లె రామాలయంలో హోమాలు



సోమల, ఫిబ్రవరి 19: సోమల పంచాయతీ గన్నావారిపల్లెలో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయం లో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్‌ దీపాలంకరణ చేశారు. పురోహితులు గణపతిపూజ, గంగపూజ, అంకురార్పణ, రక్షాబంధన, వాస్తు హోమం నిర్వహించారు. వ్యాస హోమం, శిఖర కలశస్థాపన, కుంభాభిషేకం, గోదర్శన, జరిపారు. సీతారామ స్వామి కల్యాణోత్సవం సందర్భంగా ఉత్సవమూర్తులను అలంకరించి కల్యాణోత్సవం జరిపారు. సోమల, చెన్నయ్యగారిపల్లె, భారతంమిట్ట, రాశెట్టివారిపల్లె, దిడ్డివారిపల్లె, అడుసుపల్లె, ఇరికిపెంట గ్రామాల భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

సింహవాహనంపై ఊరేగిన కాశీవిశ్వేశ్వరుడు



పలమనేరు, ఫిబ్రవరి19 : పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామిని సింహ వాహనంపై అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గంటే వీరభద్ర, ఆలయ కమిటీ సభ్యులు, ఎండోమెంట్‌ సిబ్బంది విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలకు ఆలయ మాజీ ధర్మకర్త దివంగత ఎ.సదాశివశెట్టి, బేరివైశ్యసంఘం ఉభయదారులుగా వ్యవహరించారు.

రైతన్నకు అండగా తెలుగుదేశం

రామకుప్పం, ఫిబ్రవరి 19: దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు టీడీపీ ఎల్లవేళలా అండగా నిలుస్తోందని తెలుగురైతు కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, ప్రధానకార్యదర్శి గోపాల్‌, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డిలు తెలిపారు. సోమవారం వారు రామకుప్పం పట్టణ శివార్లలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంవద్ద టీడీపీ రైతు చైతన్యయాత్రను ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ సర్కిల్‌లో వారు రైతులనుద్దేశించి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా అందలేదన్నారు. రైతులకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు, ఇన్‌పుట్‌ సబ్సిడీ, పంటల బీమాపై ఎన్నికల్లో ఇచ్చిన హామీని పట్టించుకోలేదన్నారు. వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లను బిగించి, రైతుల మెడలకు ఉరితాళ్లను సిద్ధం చేస్తోందన్నారు. టీడీపీ పాలనలో రైతులకు సకాలంలో పంటల బీమా, ఇన్‌పుట్‌ సబ్సిడీ సత్వరం అందించామన్నారు. అనంతరం వారు వారపుసంతలో రైతులకు టీడీపీ రైతులకు అందించిన పథకాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు మండల అధ్యక్ష, ప్రధానాకార్యదర్శులు కొళ్ళపల్లెబాబు, భార్గవ్‌, నేతలు సీతాపతి, రామకృష్ణప్ప, సలాంసాబ్‌, పద్మనాభరెడ్డి, వెంకటరమణ, జ్ఞానశేఖర్‌రెడ్డి, పెరుమాళ్‌, ప్రకాష్‌యాదవ్‌, టీవీరవి, సుబ్బి, బాలరాజు, మంజునాథ్‌, శంకర్‌, రఘునాథరెడ్డి, గిరి, అల్లీశీను, ఎస్వోసుబ్రహ్మణ్యం, వెంకట్రామ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ జయంతి

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 19 : బైరెడ్డిపల్లెలో సోమవారం భజరంగ్‌దళ్‌ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజి చిత్రపటానికి పూజలు నిర్వహించి కాషాయ జెండాలు చేత పట్టుకుని ఊరేగింపు నిర్వహించారు.

కుప్పంలో అన్నదానం

కుప్పం, ఫిబ్రవరి 19: కుప్పంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవా రం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు జరిపారు. బాణాసంచా పేలుస్తూ జై శివాజీ, జై భవానీ అనే నినాదాలతో హోరెత్తించారు. పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్ర మంలో రామకృష్ణ, శంకర్‌, నారాయణ, సుబ్రమణ్యం, మహదేవన్‌, బేటప్ప, నరేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలి

శాంతిపురం, ఫిబ్రవరి 19: నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ నారా భువనేశ్వరి మంగళ, బుధవారాల్లో కుప్పం పర్యటనకు విచ్చేస్తున్నారని, తెలుగు మహిళలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉదయ్‌కుమార్‌, నాయకులు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్‌, ఆర్‌ఎస్‌ మణి, చలపతి, హరినాథ్‌రెడ్డి, రమేష్‌, రుద్రప్ప. శ్యామల, అనుసూయ, సుగుణమ్మ, రూప తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి మృతి



శ్రీనాథ్‌(ఫైల్‌ఫొటో)

గుడుపల్లె, ఫిబ్రవరి 19: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన గుడుపల్లె మండలంలో చోటుచేసుకొంది. రైల్వే పోలీసులు, గ్రామస్థుల కథనం మేరకు...

శాంతిపురం మండలం గట్టూరుకు చెందిన వెంకటముని కుమారుడు శ్రీనాథ్‌(30) ఎక్కువ మొత్తంలో అప్పులు చేసాడు. ఇంటికి అప్పుల వాళ్ల రావడంతో మనస్థాపం చెందిన శ్రీనాథ్‌ ఆదివారం గుడుపల్లె సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం రైల్వే కీమ్యాన్‌ గుడుపల్లె సమీపంలో రైలు పట్టాలపై మృతదేహం ఉండటాన్ని గమనించి స్టేషన్‌ మాస్టర్‌కు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీలో జగన్‌ రాజ్యాంగం అమలు : కంచర్ల





కుప్పంలో డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌, ప్రేమ్‌కుమార్‌ తదితరులు, అఖిలపక్ష నేతలు - పలమనేరులో నిరసన వ్యక్తం చేస్తున్న విలేకరులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

కుప్పం,ఫిబ్రవరి19: ఆంధ్రప్రదేశ్‌లో నడుస్తున్నది జగనన్న రాజ్యాంగమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ విమర్శించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఈనెల 18వ తేదీన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు చేసిన దాడిని నిరసిస్తూ కుప్పంలో సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో అఖిలపక్షం ధర్నా చేసింది. స్థానిక అంబేడ్కర్‌ విగ్రహం ఎదుట జర్నలిస్టు సంఘాలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ 2019లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాస్వామ్యవాదులను, ప్రశ్నించేవారిని అణచడమే లక్ష్యంగా సీఎం జగన్‌ అరాచకాలు చేస్తూ పోయారన్నారు. అఖిలక్ష నాయకులు, జర్నలిస్టు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనాథ్‌కు వినతిపత్రం అందించారు. టీడీపీ కుప్పం రూరల్‌ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌, కాణిపాకం వెంకటేశ్‌, వీజీ.ప్రతాప్‌, విష్ణు, మురళి, మణి, ఉమాపతి, వేలు, మురుగేశ్‌, వెంకటేశ్‌, ఆర్‌ఆర్‌.రవి, మురళి, కృష్ణ, మణి, వేణుగోపాల్‌, దాము, సురేశ్‌, సెల్వం, వేలు, సుగుణమ్మ, అనసూయ, భార్గవ్‌, చాంద్‌, దొరై, వివిధ అఖిలపక్ష సంఘ నేతలు, జర్నలిస్టు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు : రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌ కృష్ణపై వైసీపీ కార్యకర్తలు చేసిన దాడిపై సోమవారం పలమనేరు ఆర్డీఓ కార్యాలయం ముందు విలేకరులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ కుప్పస్వామికి వినతిపత్రం అందజేశారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో వివిధ పత్రికలు, టీవీ చానళ్ల విలేకరులతో పాటు టీడీపీ ఎస్సీసెల్‌ నియోజకవర్గ కన్వీనర్‌ నాగరాజు, టీడీపీ నాయకుడు ఖాజాపీర్‌, సీపీఎం నాయకులు ఓబుల్‌రాజు, గిరిధరగుప్తా, ఐద్వా జిల్లా నాయకురాలు భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వి.కోట : ఏబీఎన్‌ కెమెరామెన్‌ కృష్ణపై జరిపిన దాడి హేయమైన చర్యగా మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్‌ అన్నారు. విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయుల పై ఇలాంటి అమానవీయ, పాశవిక దాడిని యావత్‌ సమాజం ఖండిస్తోందన్నారు.

చౌడేపల్లె : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌ కృష్ణపై వైసీపీ మూకలు దాడులు చేయడం దారుణమని టీడీపీ నాయకులు అన్నారు. జర్నలిస్టులకు భద్రత కల్పించాలన్నారు. అనంతరం డీటీ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందించారు.పోలీసులకూ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ ప్రచార కార్యదర్శి మునెంకటప్ప, బీసీ సెల్‌ కార్యదర్శి బోయకొండ సుబ్రహ్మణ్యం, నాయకులు పార్థసారథి, రెడ్డి, బాలాజి చంగల్రాయుడు పాల్గొన్నారు.

పుంగనూరు : రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమే ధ్యేయంగా వైసీపీ ప్రభుత్వం పని చేస్తోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జనార్దన్‌ ఆరోపించారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌ శ్రీకృష్ణపై వైసీపీ సిద్ధం సభలో జరిగిన మారణకాండకు నిరసనగా సోమవారం పుంగనూరులో జర్నలిస్టులు ధర్నా, ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్‌ సర్కిల్‌ నుంచి జర్నలిస్టులు అంబేడ్కర్‌ సర్కిల్‌ వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులు అర్పించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, జర్నలిస్టుపై దాడులను అరికట్టాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ తహసీల్దార్‌ తసీనాకు వినతి పత్రం అందజేశారు. ఫొటోగ్రాఫర్‌ కృష్ణపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడం అమానుషమని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు అయూబ్‌ఖాన్‌, బీసీవై పార్టీ నాయకులు ఆర్‌.హరినాథరెడ్డి, సాంబమూర్తి, ఆనంద్‌, కిరణ్‌, సదుం విశ్వనాథరెడ్డి, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్‌ అధికార ప్రతినిధి ఎం.శ్రీకాంత్‌, రాజంపేట టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షులు ఆసూరి బాలాజీ, రెడ్డెప్పనాయుడు, రామయ్య, కాంగ్రెస్‌ నాయకుడు సజ్జాద్‌లు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.

పెద్దపంజాణి : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌ శ్రీకృష్ణపై దాడికి పాల్పడ్డ వారిని వెంటనే అరెస్టు చేయాలని పెద్దపంజాణి మండల పాత్రికేయులు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం తహశీల్దారు నాగేంద్రకు వినతి పత్రం అందించారు.







చౌడేపల్లెలో డీటీ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు, పుంగనూరులో ధర్నా చేస్తున్న జర్నలిస్టులు, పెద్దపంజాణి తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు

సచివాలయ భవనం ప్రారంభం

గంగవరం, ఫిబ్రవరి 19: మండలంలోని కీలపల్లెలో సోమవారం సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రారంభించారు. అనంతరం పొన్నమాకులపల్లె హైస్కూల్‌లో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించి, విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం, బోధన, ట్యాబ్‌లు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణ, మోహన్‌రెడ్డి, చలపతిరెడ్డి, ప్రహ్లాద, గిరిరాజారెడ్డి లతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

డంపింగ్‌ యార్డులో అగ్నిప్రమాదం

పుంగనూరు రూరల్‌, ఫిబ్రవరి 19: పట్టణ శివార్లలోని ములబాగిళ్‌ రోడ్డులో గల మున్సిపల్‌ డంపింగ్‌ యార్డులో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. మున్సిపల్‌ చైర్మన్‌ అలీంబాషా అగ్నిప్రమాదం గురించి సమాచారం ఇవ్వగా వెంటనే ఫైర్‌ఇంజన్‌తో సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేసినట్లు ఫైర్‌ ఆఫీసర్‌ సుబ్బరాజు వివరించారు.

ఘనంగా వీరభద్రస్వామి కల్యాణోత్సవం




బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 19 : మండలంలోని నెల్లిపట్ల గ్రామంలో వున్న వీరభద్రస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ గావించి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా వీరభద్ర రజక సహకార సంఘం సభ్యులు ఆలయంవద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

ఓం శక్తి ఆలయానికి భూమి పూజ



చౌడేపల్లె, ఫిబ్రవరి19: ఓం శక్తి ఆలయానికి భూమి పూజ వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అమ్మవారి భక్తులు సోమవారం నిర్వహించారు. స్థానిక గోసల కురప్పల్లెలో వెలసిన శ్రీకాశీవిశ్వేస్వరస్వామి ఆలయ మాన్యంలో అమ్మవారి భక్తులు ఉదయం భూమి పూజలు నిర్వహించారు. అమ్మవారి భక్తులు, దాతల సహకారంతో ఆలయం నిర్మించనున్నట్లు వారు పేర్కొన్నారు.

హంస వాహనంపై వేణుగోపాలుడి విహారం



వి.కోట, ఫిబ్రవరి19: రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను సోమవారం ప్రారంభించారు. ఆదివారం ఆలయ ధర్మకర్త ఆలూరి సీతారామయ్య నేతృత్వంలో బ్రాహ్మణ సంఘం వారిచే ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. స్వామి వారిని విశేషంగా అలంకరించి, అభిషేకాలు నిర్వహించారు. ఆపై భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి ఉత్సవమూర్తులను హంస వాహనంపై కొలువుదీర్చి వీధుల్లో ఊరేగించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కుప్పం రూరల్‌, ఫిబ్రవరి 19: మండల పరిధిలోని బోదగుట్టపల్లె గ్రామానికి చెందిన హరి (24) ఆదివారం రాత్రి వెండుగంపల్లె సమీపంలో ద్విచక్ర వాహనంపై ప్రమదానికి గురై మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ సోమవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మట్టి ఖర్చులకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసినందుకు రౌడీషీట్లా..!

- ఎస్డీపీఐ నేతల ఆగ్రహం

పుంగనూరు, ఫిబ్రవరి19: ప్రజలకు సేవలు అందిస్తున్న ఎస్డీపీఐ నాయకులపై అన్యాయంగా సీఐ రాఘవరెడ్డి రౌడీషీట్లు తెరవడం న్యాయమా అంటూ ఆ పార్టీ జిల్లా నాయకులు జమీర్‌, యూసఫ్‌ ప్రశ్నించారు. సోమవారం వారు పుంగనూరులో విలేకరులతో మాట్లాడుతూ రౌడీషీటర్లుగా తమపార్టీకి చెందిన ముబారక్‌, సిద్దిక్‌లపై నమోదు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో కులమతాలకు అతీతంగా ప్రజలకు సేవ చేశామన్నారు. తమపై పెట్టిన రౌడీషీట్‌ కేసులను వెంటనే ఎత్తివేయకపోతే ప్రజలతో కలసి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించారు.

టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు



రొంపిచెర్ల, ఫిబ్రవరి19: పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో సోమవారం జాండ్లవారిపల్లె పంచాయతీ మొరవపేట, గుండ్లకాడపల్లె గ్రామాలకు చెందిన 70 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు వారి కుటుంబసభ్యులతో టీడీపీలోకి చేరారు. రెడ్డిబాషా, మస్తాన్‌, ఖాదర్‌బాషా, మోదీన్‌సాహెబ్‌, అబ్దుల్‌సాహెబ్‌, కరీముల్లా, రఫీ, మహబూబ్‌సాహెబ్‌, నాగిరెడ్డి, రఘునాధరెడ్డి, రవీంద్రనాధ్‌రెడ్డి, బాబులాల్‌, భారేషా, జాకీర్‌ తదితరులకు పార్టీ కండువాలు చల్లాబాబు కప్పి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ వైసీపీపై విరక్తితో చంద్రబాబునాయుడు రాష్ట్రానికి చేసిన అవస్యకత ఉందని చల్లాబాబు ఆదరణకు మేము చేరామన్నారు. మీకు ఎకష్టం వచ్చినా తాను అండగా ఉంటానని చల్లాబాబు వారికి చెప్పారు. ఈకార్యక్రమంలో మాదవరెడ్డి, బావాజాన్‌, అబూబకర్‌, రఫీ, రఘునాథ రెడ్డి పాల్గొన్నారు.

బీసీవైపార్టీలో చేరిన మంగళం వైసీపీ యువకులు

పుంగనూరు రూరల్‌, ఫిబ్రవరి19: పుంగనూరు మండలం మంగళం పంచాయతీలోని వైసీపీకి చెందిన కొంతమంది యువకులు బీసీవైపార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్‌ సమక్షంలో సోమవారం కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీవైపార్టీలో యువతకు ప్రాధాన్యత కల్పించడం, ఉపాధి కల్పించడం, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న పార్టీకి తాము మద్దతుగా నిలుస్తున్నట్లు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు ఉచితం

పుంగనూరు రూరల్‌, ఫిబ్రవరి19: ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు పాఠశాలలో 1వ తరగతిలో చేరడానికి సచివాలయంలో ఆన్‌లైన్‌ చేసుకోవాల్సివుంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ కులాల్లో అర్హత కలిగిన పిల్లల తల్లిదండ్రులు ఈనెల 23 నుంచి మార్చి 14తేదీ వరకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సంబంధిత మండల విద్యాధికారులను సంప్రదించాల్సివుందన్నారు.

ఘనంగా ధ్యానాభిరామస్వామి ఉత్సవం



బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 19 : కార్వేటి కొండ ధ్యానాభిరామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పుష్ప యాగోత్సవం ఘనం గా నిర్వహించారు. అర్చకులు సీతాలక్ష్మణసమేత ధ్యానాభిరామస్వామి ఉత్సవ మూర్తులకు విశేషాలంకరణచేసి ప్రత్యేకపూజలు జరిపారు. అనంతరం మేళ తాళాల మధ్య నెమలివాహనం, సూర్యప్రభవాహనాలపై స్వామివారిని కొలువు దీర్చి ఊరేగించారు. పలువురు భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

శివాజీ విగ్రహం ఏర్పాటు



పలమనేరు, ఫిబ్రవరి19 : పట్టణ సమీపంలోని బైపాస్‌ రోడ్డుపక్కన దేవీ గ్రూప్స్‌ వేసిన లేఅవుట్‌ లో ఛత్రపతి శివాజి విగ్రహాన్ని సోమవారం ఏర్పాటు చేసింది. జాతీయ రహదారికి అతి సమీపంలోని సర్వీసు రోడ్డుపక్కనే ఏర్పాటు చేసిన ఈ విగ్రహం అందరిని ఆకట్టుకొం టోంది. శివాజి విగ్రహం వద్ద శివాజీ జీవిత చరిత్రను కూడా దేవీ గ్రూప్స్‌ పేర్కొంది.

తప్పుడు కథనాలు రాస్తే ప్రజలే బుద్ధి చెబుతారు

గంగవరం,ఫిబ్రవరి 19 : ఉన్నది లేనట్లు... లేనిది ఉన్నట్లు చూపిస్తూ అసత్య కథనాలు ప్రచురిస్తే ప్రజలే బుద్ధి చెబుతారని పరిశ్రమల నిర్వాహకులు ఎద్దేవా చేశారు. గంగవరం మండలం నల్లగుట్లపల్లె సమీపంలో ఏర్పాటు చేసిన నూతన ఇండస్ట్రియల్‌ ఎస్టేట్‌పై సోమవారం సాక్షి దినపత్రికలో తప్పుడు కథనాలు వెలువడడంపై ఔత్సాహిక పరిశ్రమల నిర్వాహకులు, టీడీపీ నేతలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలపై అదనపు భారం వేసి వసూళ్లు చేయడం తప్ప అబివృద్ధి చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో అమరనాథరెడ్డి, నాగరాజు, గిరిబాబు, హేమంత్‌నాయుడు, శ్రీరంగా, లోకేష్‌, శీను, ఔత్సాహిక వేత్తలు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు పుస్తకాల వితరణ

పలమనేరు : శాఖాగ్రంథాలయంలో సోమవారం డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న 100 మంది అభ్యర్థులకు ఉచితంగా పుస్తకాలను గ్రంథాలయ అధికారి హేమంత్‌ కుమార్‌ అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌ నైనారు మధుబాల ఆధ్వర్యంలో కుట్టి కోచింగ్‌ డైరెక్టర్‌ పవన్‌కుమారి సహకారంతో 100 మందికి ఈ పుస్తకాలు పంపిణీ చేశారు.

రేపటి నుంచి తిరుణాళ్ల

సదుం : పాలమంద గ్రామం జంగంపల్లెలో బుధవారం నుంచి నాలుగు రోజులపాటు కాశీవిశ్వేశ్వర స్వామి తిరుణాళ్ల ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 21న అంకురార్పణ, 22న ధ్వజారోహణం, 23న ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పిల్లనగ్రోవి కీర్తనలు, భజనలు, అన్నదానం, 24న స్వామి కల్యాణోత్సవం, గ్రామోత్సవం, 25న వసంతోత్సవం, పార్వేట ఉత్సవం, పవళింపు సేవ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

సదుం హైస్కూల్‌ హెచ్‌ఎంగా జయకుమార్‌ రెడ్డి



సదుం : సదుం జడ్పీ హైస్కూల్‌ హెచ్‌ఎంగా జయ కుమార్‌ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి నుంచి బదిలీపై ఆయన సదుం వచ్చారు. గతంలో ఇదే పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా ఎనిమిదేళ్లపాటు ఆయన పనిచేశారు. ఆయన పదోన్నతిపై మళ్లీ సదుం రావడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

పులిచెర్ల విద్యార్థికి నగదు పురస్కారం



కల్లూరు : పులిచెర్ల ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చరణ్‌ ఇటీవల ఈఈఎంపీ పరీక్షలో జిల్లా స్థాయిలో మూడవ ర్యాంకు సాధించడంతో ఆదివారం విజయవాడలో స్కూల్‌ ఎడ్యుకేషన్‌ కమిషనర్‌ సురేష్‌కుమార్‌ చేతులమీదుగా నగదు పురస్కారం అందుకున్నట్లు ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. నగదు పురస్కారంపాటు ప్రశంసాపత్రం, మెమెంటోను విద్యార్థికి అందజేశారన్నారు.

పులిచెర్ల ఇన్‌చార్జి హెచ్‌ఎంగా సయ్యద్‌ సాహెబ్‌వలీ

కల్లూరు : పులిచెర్ల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎంగా సయ్యద్‌ సాహెబ్‌వలీ సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేస్తున్న సూర్యనారాయణ జనవరి 31న పదవీవిరమణ చెందడంతో హెచ్‌ఎం పోస్టు ఖాళీ అయింది. ఇదే పాఠశాలలో ఉన్న గణిత ఉపాధ్యాయుడు సయ్యద్‌ సాహెబ్‌వలీ ఇన్‌చార్జి హెచ్‌ఎంగా నియమితులయ్యారు.

సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కుల పంపిణీ

కల్లూరు: పులిచెర్ల మండలంలోని ఐదుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులు పంపిణీ చేసినట్లు జడ్పీటీసీ మురళీధర్‌, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. రెడ్డివారిపల్లి పంచాయతీకి చెందిన నవమోహన్‌రెడ్డికి రూ.2.10 లక్షలు, లక్ష్మికి రూ.15 వేలు, కల్లూరుకు చెందిన మల్లికార్జున నాయుడుకు రూ.లక్ష, ఎస్‌పి సలీమ్‌కు రూ.20 వేలు, కోటపల్లికి చెందిన సోంపల్లి బాబుకు రూ.1.40 లక్షలు మంజూరు కావడంతో సోమవారం బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న మైనారిటీలు

కుప్పం : మండల పరిధిలోని వి.మిట్టపల్లెకు చెందిన వైసీపీలోని 25 కుటుంబాల మైనారిటీలు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్‌.మునిరత్నంలు పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపడానికే అన్నక్యాంటీన్



అన్నదానం చేస్తున్న టీడీపీ నేతలు

పూతలపట్టు, ఫిబ్రవరి 19: బడుగు, బలహీన వర్గాల ప్రజల కడుపు నింపేందుకే అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశామని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ మురళీమోహన్ అన్నారు. సోమవారం ఆయన అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌లో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, ప్రతాపనేని చంద్రమౌళి, కిరణ్, నాదముని, ఊట్ల నాగరాజు నాయుడు, ఏకాంబరం, వీరభద్రయ్య, దాము, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న చిత్తూరు ప్రెస్‌క్లబ్ సభ్యులు, కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న జర్నలిస్టులు, పూతలపట్టులో విలేఖరులు, టీడీపీ నాయకుల నిరసన

పరాకాష్ఠకు చేరిన వైసీపీ అరాచకపాలన: టీడీపీ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 19: రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి వైసీపీ అరాచకపాలనకు పరాకాష్ఠ అని టీడీపీ నేతలు విమర్శించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసనలో వీరు మాట్లాడారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని సీఎం జగన్, వైసీపీ గూండాలు చేస్తున్న దుర్మార్గమైన చర్య అంటూ మాజీ ఎమ్మెల్సీ దొరబాబు విమర్శించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ఎలాగైనా గెలవాలనుకుంటున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని చంద్రప్రకాష్ హెచ్చరించారు. ఇలాంటి దాడులను అందరూ ఖండించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్ కోరారు. అన్యాయాలు, అక్రమాలు, దాడులకు దిగుతున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలని మాజీ మేయర్ కటారి హేమలత పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు త్యాగరాజన్, రాజశేఖర్, కంద, మేషాక్, శశికర్ బాబు, శంకర్, రాజేష్, కాంంద్ర రమేష్, గురేష్, ప్రవీణ్, శీన, సతీష్, జాఫర్, మౌళి, నరేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని చిత్తూరు ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన చేశారు. జర్నలిస్టు బాల సుబ్రమణ్యం, మాట్లాడుతూ పోలీసులు వెంటనే దాడిచేసిన వారిని అరెస్టుచేసి నిష్పక్షపాతంగా కేసులు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం డీఆర్‌వో పుల్లయ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో చిత్తూరు ప్రెస్‌క్లబ్ సభ్యులు పవన్, మహేష్, అభి, శ్రీనివాసమూర్తి, మురళీకృష్ణ, మనోహర్ రెడ్డి, షేక్ కరీముల్లా, రమేష్, శివకుమార్, జయకర్, నవీన్, గజపతి, జయరాజ్, రాజు, కృపానందరెడ్డి, నరేష్, చంద్ర, సూరి, గౌరి, రోహిత్, జయప్రకాష్, తిరుమల, వెంకటేష్, రాజేష్, ఉమాశంకర్, యాగవేంద్రరెడ్డి, జయచంద్ర, పాల్గొన్నారు.



నగరి ఆర్డీవో కార్యాలయం వద్ద విలేకరులు, అఖిలపక్ష నాయకుల నిరసన



నల్లదుస్తులతో నిరసన తెలుపుతున్న చలపతి, లత తదితరులు



చిత్తూరులో నిరసన తెలుపుతున్న జిల్లా దళిత ప్రజా సంఘాల నేతలు

జర్నలిస్టులపై దాడి హేయం

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య అని జిల్లా దళిత ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మునస్వామి అన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్ వద్ద నిరసన చేశారు. కార్యక్రమంలో నేతలు పార్థసారథి, విజయగౌరి, జమీలాబి, సతీష్, దేవా తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అందుకే సైకోల్లా మీడియాపై దాడులు చేస్తున్నారని కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు తీవ్రంగా విమర్శించారు. సోమవారం నగరంలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ గూండాలు అమానుషంగా దాడి చేయడం దారుణమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు మాట్లాడుతూ మీడియాపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామన్నారు. సీపీఐ నగర కార్యదర్శి గోపినాథ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర మహిళా నేతలు విక్టోరియా, రాణి, బీసీ సెల్ నాయకులు పూర్ణచంద్ర, సీపీఐ నాయకులు చంద్ర, మణి, విజయగౌరి, రమాదేవి, జమిలాబి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు (సెంట్రల్): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు గాంధీ విగ్రహం ముందు నిరసన చేపట్టారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి గురుగణేష్, భవన నిర్మాణ విభాగం జిల్లా అధ్యక్షుడు షణ్ముగం, జిల్లా అధికార పత్రినిధి రాజేంద్ర నాయుడు, మండల అధ్యక్షులు రామభద్ర, షణ్ముగం, ఉదయ్, సురేష్, పూర్ణచంద్ర, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రెహమాన్, దొరబాబు, నీరజాక్షులు, మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరు కలెక్టరేట్: రాప్తాడు ఘటనలో బాధ్యులను శిక్షించాలంటూ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) తరఫున కలెక్టర్ షన్మోహన్‌కు వినతిపత్రాన్ని అందించారు. జాప్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతి, నేతలు కందస్వామి, ఫైరోజ్ బాష, మస్తాన్, జ్ఞానప్రకాష్, గిరిబాబు, షమీవుల్లా, నవాజ్‌బాషలతో పాటు పలమనేరు, నగరి పాత్రికేయులు పాల్గొన్నారు.

నగరి: నగరిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం విలేకరులు, టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. అక్కడ్నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి నిరసన తెలిపారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయాలంటూ ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంటుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్‌బాబు, బాలాజీ, టీఎన్‌టీయూసీ బాలాజీ, మీరా, గుణశేఖర్, జ్యోతినాయుడు, ధనంజయ నాయుడు, కృష్ణారెడ్డి, నారాయణస్వామి నాయుడు, రమేష్ రాజు, జనసేన మహేష్, సీపీఐ కోదండస్వామి, నాగరాజు, వేలన్, మురళి, సీపీఎం పెరుమాళ్, తదితర నాయకులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాప్రతినిధులు పాల్గొన్నారు.

సామాలమ్మ గుడి వద్ద నిరసన

నగరి పరిధిలోని సామాలమ్మ గుడి వద్ద చలపతి, లతల ఆధ్వర్యంలో నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మాజీ కౌన్సిలర్ లత, తెలుగు మహిళలు పసుపు కెమెరాలు చేతిలో పట్టుకుని నల్ల దుస్తులు, ముఖానికి నల్ల మాస్కులు ధరించి నిరసన లో పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, మీడియా ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీగా పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లి దుండగులను అరెస్ట్‌చేయాలని కోరుతూ ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. వివిధ టీవీలు, పత్రికల ప్రతినిధులు నిరసనలో పాల్గొన్నారు.

పాలసముద్రం: ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరి మూకల దాడి అమానుషమని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు ఖండించారు. దాడిచేసిన వారిని అరెస్టుచేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

శ్రీరంగరాజపురం: రాప్తాడు ఘటనను టీడీపీ జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు బోడపాటి లోకనాథం నాయుడు, నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యదర్శి ఎన్. కుమార్ ఖండించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కార్వేటినగరం: దాడికి పాల్పడిన వారిని గుర్తించి వెంటనే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. దాడిని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, ఇతర నాయకులు ఖండించారు.



చిత్తూరులో మాట్లాడుతున్న బీజేపీ నేత అట్లూరి శ్రీనివాసులు

నింద్ర: వైసీపీ నాయకులు దాడి చేయడాన్ని నింద్ర మండల టీడీపీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. యుద్ధానికి సిద్ధమా అంటూ సీఎం జగన్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో వైసీపీ శ్రేణులు ఇలా ప్రవర్తిస్తున్నారన్నారు.

పెనుమూరు: మీడియా గొంతు నొక్కేందుకు అధికార పార్టీ చేస్తున్న ప్రయత్నం దారుణమని మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు అన్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ఈశ్వర్ నాయుడు, తలారి రెడ్డెప్ప, భాస్కర్, చిరంజీవిరెడ్డి, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: సామాజిక న్యాయం అనే పదం పలికే అర్హత జగన్‌రెడ్డికి లేదని, ఆయన పేరు చెబితే హింసా రాజకీయాలే గుర్తుకొస్తాయని పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ మురళీమోహన్ అన్నారు. పూతలపట్టు అంబేడ్కర్ సర్కిల్ వద్ద జర్నలిస్టుల ధర్నాకు టీడీపీ నాయకులు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు ప్రతాపనేని చంద్రమౌళి, హేమాద్రి, ఏకాంబరం, నాదముని, వీరభద్రయ్య, భాస్కర్‌తో పాటు పలువురు నాయకులు, మండల విలేఖరులు పాల్గొన్నారు.

గుడిపాల: ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం పిరికిపంద చర్య అని చిత్తూరు పార్లమెంటరీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పీటర్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, వాసు రెడ్డి ఖండించారు.

పెనుమూరు: వైసీపీ మూకలు దాడి హేయమైన చర్య అని, ఇలాంటి సంఘటనలను సీఎం ఖండించక పోవడం తగదని రాష్ట్ర బీసీ సంఘం అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, జిల్లా జనసేన కార్యదర్శి స్వామినాథన్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కైలాసం యాదవ్‌లు ఖండించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం: ఒకరి అరెస్టు



స్వాధీనం చేసుకొన్న మద్యం ప్యాకెట్లు, నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

తవణంపల్లె, ఫిబ్రవరి 19: కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రూ.50 వేలు విలువ గల కర్ణాటక మద్యం, రూ.5 లక్షలు విలువ గల కారును స్వాధీనం చేసుకొన్నట్లు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. డీఎస్పీ కథనం మేరకు వివరాలు. మద్యం అక్రమ రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం మండలంలోని మత్యంక్రాస్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, పెద్దపంజాణి మండలం సంపల్లెకు చెందిన సోమప్ప కుమారుడు లవకుమార్ కారులో కర్ణాటక మద్యాన్ని బెంగళూరు నుంచి చిత్తూరు వైపు తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి 15 బాక్సుల మద్యం బాటిళ్లు, 1248 టెట్రా ప్యాకెట్లను, కారును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తవణంపల్లె ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కరణం అభ్యుదయ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19: ఆంధ్రప్రదేశ్ కరణం అభ్యుదయ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం సోమవారం స్థానిక శీర్ కరుణీకర్ కల్యాణ మండపంలో జరిగింది. సమావేశానికి పలువురు కరణం సభ్యులు హాజరయ్యారు. సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా తాండవమూర్తి, కార్యదర్శిగా నిరంజన్‌బాబు, కోశాధికారిగా ఏడుకొండలు ఎంపికయ్యారు. వీరిని కరుణీకర్ సంఘ నాయకులు అశోక్ కుమార్, జయశంకర్ తదితరులు అభినందిస్తూ భవిష్యత్ కార్యాచరణ కోసం సంఘ సభ్యులు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అవిలాల శ్రీధర్, రమణ, జగదీష్, గురునాథ్, శ్రీనివాస్, శరవణ, రమేష్, త్యాగరాజన్, మొగిలీశ్వరన్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

గుడిపాల, ఫిబ్రవరి 19: విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో పాఠ్యాంశాలను బోధంచాలని ఎంఈవోలు రామ్‌నాయక్, గణపతి అన్నారు. సోమవారం నరహరిపేట హైస్కూల్‌లో సీఆర్సీ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రణాళిక ప్రకారం విద్యాభ్యాసం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, చంద్రశేఖర్ పిళ్ళై, సీఆర్పీలు వెంకటేష్, శాంతకుమారి, వాణిశ్రీ పాల్గొన్నారు.

కొండ మల్లీశ్వరుడికి పాలాభిషేకం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 19: డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా పాలభిషేకం నిర్వహించారు. అమెరికాకు చెందిన ప్రవాసాంధ్రులు టి.దేవసేన, డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. వ్యవస్థాపక ధర్మకర్త కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు స్వామి సేవలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

'స్పందన'లో మూడు వినతులు

చిత్తూరు, ఫిబ్రవరి 19: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నగరానికి చెందిన మూడు సమస్యలు వచ్చాయని అసిస్టెంట్ మేనేజర్ గోవర్ధన్ తెలిపారు. ఇంజనీరింగ్ శాఖకు ఒకటి, ప్రజారోగ్య విభాగానికి రెండు చొప్పున మొత్తం మూడు అర్జీలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈ గోమతి, ఎంహెచ్‌వో లోకేష్, సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి జయంతి వేడుకలు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 19: స్థానిక రంగాచారి వీధి రామవిలాససభలో సోమవారం ఛత్రపతి శివాజి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు రామవిలాస సభ నుంచి ఛత్రపతి చిత్ర పటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం శివాజి వీరత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో రాంభద్ర, సతీష్ కృష్ణమర్తి, బాలకృష్ణ, జగదీష్, భాస్కర్, మధు, సాగర్‌రాజా, బాలాజి, ధరణి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 19: చవటపల్లె నాగాలమ్మ ఆలయ సమీపంలోని బృందావన్ పాఠశాలలో చిత్తూరు హరివిల్లు లలితకళా వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి బి.మునస్వామి తెలిపారు. కార్యక్రమానికి శైలజాకుమారి అధ్యక్షత వహిస్తారని, వి. హరి నాయుడు, టి. గోవిందన్, భాస్కరెడ్డి తదితరులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.






గంగాధరనెల్లూరులో మీడియా ప్రతినిధుల నిరసన, కార్వేటినగరంలో ఫిర్యాదు చేస్తున్న విలేకరులు తదితరులు, పెనుమూరులో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

వైసీపీ పాలనలో దాడులు, విధ్వంసాలే: దొరబాబు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 19: వైసీపీ పాలనలో రాష్ట్రంలో దాడులు, విధ్వంసాలు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. సోమవారం నగరంలోని 4వ డివిజన్ కట్టమంచి, 26వ డివిజన్ భరత్ నగర్‌లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం జగన్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి అప్రజాస్వామిక పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం మిని మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో చంద్రప్రకాష్, గురజాల జగన్ మోహన్, కటారి హేమలత, కాజూరు బాలాజీ, తేజస్విని, రాజశేఖర్, కంద, జాఫర్, కిషోర్, కోడిబాబు, లక్ష్మీపతి, శివ, విక్టర్ బాబు, కన్న, చంద్ర, కుమార్, నాగలక్ష్మి, తారక్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు 'సిద్ధం'

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో పన్నుల బాదుడు, నిత్యావసర సరుకుల పెరుగుదల, పెట్రోల్, డీజల్, విద్యుత్ ఛార్జీల బాదుడుతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శి సురేంద్రకుమార్ మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందని విమర్శించారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ మాట్లాడుతూ పోలవరం నిర్మాణం టీడీపీ ప్రభుత్వ హయాంలో 75 శాతం పూర్తయిందని, మిగిలిన 25 శాతం పనులను పూర్తి చేయలేని అసమర్థ సీఎం జగన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, జాఫర్, ప్రభుతేజ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

పేదల ఆర్థికాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెటు అందజేస్తున్న ప్రదీప్

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 19: గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని చిత్తూరు నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ ప్రదీప్ అన్నారు. గంగాధరనెల్లూరు మండలం వేల్కూరు రోడ్‌పక్కన దళితవాడలోని క్రాస్ స్వచ్ఛందసంస్థ ప్రారంభించి 30ఏళ్ల పూర్తయినందుకు ఆసంస్థ అధ్యక్షుడు భూపతి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రాస్ సంస్థ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు ఎన్‌వైకె కోఆర్డినేటర్ ప్రదీప్ సర్టిఫికెట్‌లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో మండల ఐకేపీ ఏపీఎం చిరంజీవి, సింధియా, సుచి, త్రిబులెక్స్‌లతో పాటు పలు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ కూరగాయల స్టాల్ ఏర్పాటు



ఆకుకూరలు, కూరగాయలను చూపుతున్న దృశ్యం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 19: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన కూరగాయలు, ఆకు కూరలతో సోమవారం వెదురుకుప్పం వెలుగు కార్యాలయం వద్ద స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. ఈ పద్ధతుల ద్వారా పండించిన కూరగాయలు, ఆకు కూరలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం కవిత, ఎఫ్‌పీవో ఏపీఎం రామ్మోహన్, ఏపీసీఎన్ఎఫ్ ఎంటీ హనుమంతు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 19: మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల్లో ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతో ఉత్తమ ఫలితాలు సాధించాలని సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ మందారాణి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాలను ఆమె సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ కంటి చూపు ముఖ్యం




కంటిపరీక్షలు చేస్తున్న డాక్టర్ అబ్బాస్

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 19: ప్రతి ఒక్కరికీ కంటి చూపు ఎంతో ముఖ్యమని రెవరెండ్ జాన్‌నవీన్ అన్నారు. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం దళితవాడ సీఎస్ఐ చర్చి సహకారంతో చెన్నైకి చెందిన ఎం.ఎన్. కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం డాక్టర్ అబ్బాస్ నిర్వహించగా, 46మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి, 11 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ దేవేంద్రన్, తూగుండ్రం సర్పంచ్ శ్రీబాబు, సభామనేగర్ జీవరత్నం, పలువురు రోగులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పట్టాల పంపిణీ

విజయపురం, ఫిబ్రవరి 19: మండలంలోని కేవీపురంలో లబ్ధిదారులకు సోమవారం మంత్రి ఆర్కే రోజా ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ బాలాజీ, సింగిల్‌విండో చైర్మన్ హరిబాబునాయుడు, ఆర్బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోవర్ధన్ నాయుడు, నాయకులు బాలకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎం.ఆర్. చంద్రకు పలువురి నివాళి



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 19: ప్రముఖ ప్రజా కవి, పల్లెసీమ వారప్రతిక సంపాదకుడు, జర్నలిస్టు ఎం.ఆర్. చంద్ర 25వ వర్ధంతి కార్యక్రమం సోమవారం జరిగింది. స్థానిక సుందరయ్యవీధిలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు రచయితలు ఎం.ఆర్. చంద్ర సేవలను కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. డా.కె. రామలక్ష్మి, రోజాప్రియ, నిరంజన్‌రెడ్డి, ఎం.ఆర్. అరుణకుమారి, సహదేవ నాయుడు, హరి నాయుడు, బి. మునస్వామితో పాటు పలువురు రాజకీయ, సాహితీ, కళా రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

206వ రోజు అన్నదానం

గుడిపాల, ఫిబ్రవరి 19: మండలంలోని అన్న క్యాంటీన్‌లో సోమవారం 206వ రోజు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శివగంగ బిల్డర్స్ యజమాని లంకిపల్లె రవి నాయుడు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిట్టు, సుధాకర్ యాదవ్, జయరామ్ యాదవ్, సుబ్రహ్మణ్యం, ఆదికేశవులు, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.